TGTEL/26/A6221
# తొలివెలుగు
TOLE VELUGGU JATIYAPATRIKA
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
జాతీయ పత్రిక
యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 02 | గురువారం | 30-7-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-
Yadadri Bhuvanagiri | VOLUME:01 | ISSUE:02 | Thursday | 30-7-2026 | PAGES:08 | COST:2/-

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## రెండు ఎమ్మెల్సీలనూ కొట్టాల్సిందే

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై పీసీసీ సమన్వయ కమిటీ సమీక్ష
- ఒక స్థానానికి దామోదర, మరో స్థానానికి ఇన్‌చార్జీలుగా భట్టి, ఉత్తమ్
- సెప్టెంబర్ 15 తర్వాత కార్పొరేషన్ చైర్మన్ల నియామకాలు
- టీపీసీసీ సమన్వయ భేటీలో నిర్ణయాలు



న్యూఢిల్లీ: రాష్ట్రంలో పట్టభద్రులకు మరింత దగ్గరయ్యేలా, వచ్చే ఫిబ్రవరిలో జరిగే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలనూ గెలుచుకునేలా ఇప్పటినుంచే నేతలంతా పనిచేయాలని పీసీసీ సమన్వయ కమిటీలో నిర్ణయించారు. గ్రాడ్యుయేట్ స్థానాలకు ఆగస్టులోగా అభ్యర్థుల ఎంపికపై నిర్ణయానికి రావాలని నిశ్చయించారు. ఇందుకోసం మహబూబ్‌నగర్--హైదరాబాద్--రంగారెడ్డి జిల్లాలకు ఎన్నికల ఇన్‌చార్జిగా మంత్రి దామోదర రాజనర్సింహకు బాధ్యతలు కట్టబెట్టారు. ఆయన ఇతర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి అభ్యర్థిపై నిర్ణయానికి రావాలని నిర్ణయించారు. నల్లగొండ--ఖమ్మం--వరంగల్ స్థానానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను ఇన్‌చార్జీలుగా నియమించారు. మంత్రులు తమ జిల్లాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (డీసీసీ), ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతంగా చర్చించి.. ముగ్గురు సభ్యులతో కూడిన ప్యానెల్ ద్వారా పార్టీ అధిష్టానానికి నివేదిక సమర్పి పంచాలని నిర్ణయించారు.

- మిగతా 2వ పేజీలో



## మాజీ బస్ డ్రైవర్ ఇంట్లో 15 కేజీల బంగారం

**35 సంచుల్లో రూ. 20 కోట్లకుపైగా నగదు**


**పశ్చిమబెంగాల్ అక్రమ వ్యాపార లావాదేవీలను చేధించిన పోలీసులు**

సురీ: పశ్చిమబెంగాల్‌లో అతనో సాధారణ వ్యక్తి. నార్త్‌బెంగాల్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో చాన్నాళ్లు బస్సు డ్రైవర్‌గా పనిచేసి మానేశాడు. అతని ఇంట్లో అసాధారణ స్థాయిలో నగదు నిల్వలు పోగుబడ్డాయన్న నిఘా వర్గాలు ఉప్పందించడంతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమై బుధవారం అతని ఇంట్లో సోదాలుచేశాక అక్కడ వెలుగుచూసిన బంగారం, నగదు చూసి నోరెళ్లబెట్టారు. 35 సంచుల నిండా నింపిన రూ.20 కోట్లకుపైగా కరెన్సీ

- మిగతా 2వ పేజీలో

## ఏపీలో పెట్టుబడులకు తైవాన్ ఆసక్తి..

- చంద్రబాబు, లోకేశ్ తో దిగ్గజ కంపెనీల ప్రతినిధుల భేటీ
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తో వేర్వేరుగా భేటీ అయిన తైవాన్ పారిశ్రామిక ప్రతినిధులు
- ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ రంగాలపై ప్రధానంగా చర్చలు
- రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన ముఖ్యమంత్రి
- ఏపీ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై కీలక ఒప్పందాలు
- తయారీ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి అంగీకారం



ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్‌కు చెందిన పలు దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపాయి. ఈ మేరకు తైవాన్ పారిశ్రామిక ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ లతో వేర్వేరుగా సమావేశమైంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అధునాతన తయారీ రంగాల్లో ఏపీతో భాగస్వామ్యం పెంచుకోవడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ,

- మిగతా 2వ పేజీలో

## 7,437 ఉద్యోగాలకు నోటిఫికేషన్

- తెలంగాణలో పోలీసు, ఫైర్, జైళ్ల శాఖల్లో భారీగా ఖాళీల భర్తీ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, తేదీలు త్వరలో ప్రకటన
- దరఖాస్తుకు ముందే వైద్య పరీక్షలు చేయించుకోవాలని అభ్యర్థులకు సూచన




తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలిదబుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను

- మిగతా 2వ పేజీలో




## ఎట్టకేలకు మన్మోహన్ సింగ్‌కు క్లీన్‌చిట్

బొగ్గు కుంభకోణంలో మన్మోహన్ పాత్ర లేదని తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్..

- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసు
- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణ రెడ్డికి ఆగస్టు 11 వరకు రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు
- తమది ఇద్దరి అంగీకారంతో కూడిన సంబంధమని నిందితుడి వాదన
- ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన ఉదయ్




## విద్యార్థులను హింసించే హక్కు ఎవరిచ్చారు

- మన విద్యార్థుల శరీరంలోకి పెల్లెట్లను దించారు
- సభలో అమిత్ షాపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- విద్య ఖరీదైన వ్యాపారంగా, విద్యా వ్యవస్థ క్రూరంగా మారిందని ఆందోళన
- విద్యార్థుల అసలైన శత్రువు ఆర్ఎస్ఎస్ అని ధ్వజం

2లో



## చంద్రబాబును ఎదుర్కోలేక నన్ను లక్ష్యంగా చేసుకున్నారు

**వైసీపీ నేతలపై భువనేశ్వరి తీవ్ర విమర్శలు**

**మహిళలను రాజకీయాల్లోకి లాగొద్దని వ్యాఖ్య**

**అసెంబ్లీ ఘటనను గుర్తు చేసిన భువనేశ్వరి**

**ద్రౌపది ఉదాహరణతో పరోక్ష విమర్శలు**

**చంద్రబాబుకు ప్రజలే అండగా నిలిచారని వ్యాఖ్య**

2లో




## పని మాది.. ప్రచారం చంద్రబాబుది: జగన్



- భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ తన ఖాతాలోకి వేసుకునేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారన్న జగన్
- విమానాశ్రయానికి సంబంధించిన అన్ని పనులు తమ హయాంలోనే జరిగాయని వ్యాఖ్య
- 2026 నాటికి విమాన రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామన్న జగన్

2లో




## ఇరాన్ మిలిటెంట్లపై అమెరికా–సౌదీ దాడి

**20 మంది మృతి.. 32 మందికి గాయాలు**

**గల్ఫ్‌లో అమెరికా స్థావరాలపై దాడులకు దిగిన ఇరాన్**

కైరో: పశ్చిమాసియాలో దాడుల పరంపర ఆగడం లేదు. ఇరాక్ భూభాగంలో ఇరాన్ మద్దతుగల మిలిటెంట్లపై సౌదీ అరేబియాతో కలిసి మంగళవారం అర్ధరాత్రి తర్వాత అమెరికా దాడి చేయగా.. బుధవారం తెల్లవారుజామున


# నీటి నిల్వలతోనే సమృద్ధిగా భూగర్భ జలాలు

- పంతంగిలో వేడుకగా 'జలసిరి' ఇంకుడు గుంత పనుల ప్రారంభం
- ఇంకుడు గుంతలతోనే భూగర్భ జలాల పెంపు
- ప్రతి ఇంటా నీటి సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి
- ఎంపీడీవో శ్రీలత, సర్పంచ్ బోయకాకి శ్రీలత సుందర్ పిలుపు



**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పంతంగి గ్రామంలో ఇంకుడు గుంత నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీలత, గ్రామ సర్పంచ్ బోయకాకి శ్రీలత సుందర్ హాజరై భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీలత మాట్లాడుతూ... మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో భూగర్భ జలాల పరిరక్షణ అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. వర్షపు నీటిని నిరుపయోగంగా పోనివ్వకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి మళ్లించడం వల్ల నీటి మట్టాలు గణనీయంగా పెరుగుతాయని వివరించారు. గ్రామంలో సాధ్యమైనంత వరకు ప్రతి ఇంటి వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్ బోయకాకి శ్రీలత సుందర్ మాట్లాడుతూ... వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే ఇప్పటినుంచే నీటి పొదుపుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. 'జలసిరి' పథకాన్ని గ్రామస్థులందరూ సద్వినియోగం చేసుకుని, పంతంగిని నీటి కొరత లేని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ), వివిధ వార్డుల సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వలిగొండ సమగ్రాభివృద్ధే ధ్యేయం





- వలిగొండ రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం
- పీఏసీఎస్, మత్స్యగిరి ఆలయ పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవాల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- వెంకటాపూర్, వేములకొండలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం





**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గంలో గత రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తున్నామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం వలిగొండ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**రైతుల సంక్షేమానికి పీఏసీఎస్ కృషి చేయాలి:**

మండల కేంద్రంలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గరిసె రవిని అభినందించారు. పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వలిగొండ మండలంలో రూ.200 కోట్ల వ్యయంతో సమీకృత (ఇంటిగ్రేటెడ్) పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమానాయక్, సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, కాంగ్రెస్ నేతలు బత్తిని సహదేవ్ గౌడ్, పాశం సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకారం:**

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెంకటాపూర్ శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, సభ్యులను అభినందించారు. ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందిస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పాఠశాల ప్రహరీకి శంకుస్థాపన.. జీపీ భవనం ప్రారంభం:**

వేములకొండ గ్రామంలో తన స్థానిక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) నుంచి రూ.13.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం వేములకొండ పీహెచ్‌సీలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అదేవిధంగా వెంకటాపూర్ గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ కర్నెకంటి కమలమ్మతో కలిసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు ఏర్పుల వెంకటేశం, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.






# గ్రీన్ గ్రోవ్స్‌లో ఘనంగా గురు పూజోత్సవం

- గురువుల ఆశీస్సులు తీసుకున్న విద్యార్థులు
- విలువలతో కూడిన విద్యే లక్ష్యం: చైర్మన్ బండి వీణ అనిల్ రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గురు పూజోత్సవాన్ని చౌటుప్పల్ పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. గురు–శిష్య సంబంధం యొక్క విశిష్టతను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రసంగాలు, గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బండి వీణ అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల భవిష్యత్తుకు సరైన మార్గనిర్దేశం చేసేది గురువులేనని అన్నారు. విద్యతో పాటు నైతిక విలువలను బోధించే ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. సమాజంలో గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని, “విద్యే పరమ ధనం” అనే భావనకు అనుగుణంగా విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సాదుపల్లి లక్ష్మి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణంలో సాగి అందరినీ ఆకట్టుకుంది.

# బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా బుడ్డ సురేష్

- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన పార్టీ నాయకులు
- అధ్యక్షురాలు కాడారి కల్పన ఆధ్వర్యంలో వినతి



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్‌ను అధికారికంగా గుర్తించాలని కోరుతూ బీజేపీ మున్సిపల్ శాఖ నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ శాఖ అధ్యక్షురాలు కాడారి కల్పన ఆధ్వర్యంలో పార్టీ నాయకుల బృందం కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై బీజేపీ ప్రజాప్రతినిధులు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తారని తెలిపారు. పార్టీ నిర్ణయం మేరకు 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్‌ను బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా గుర్తిస్తూ అవసరమైన అధికారిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పోలేపల్లి లక్ష్మి, ఆలే శ్రీలత, బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఆలే చిరంజీవి, పోలేపల్లి ముత్తయ్య, కాసుల వెంకటేశం, కంచర్ల వెంకట్ రెడ్డి, కాడారి అయిలయ్య యాదవ్, తెలుకుంట్ల శ్రీధర్, సర్వేల్ గ్రామ ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్, మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు వంగాల రమాకాంత్ గౌడ్, బూత్ అధ్యక్షులు కాసోజు కనకాచారి, గోపి, కుంభ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. ఆరుతడి పంటలే శరణ్యం!

- పంతంగి రైతు వేదికలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన
- తక్కువ నీటితో పండే సాగుకే మొగ్గు చూపాలి: ఎంఏఓ నాగరాజు

**తొలివెలుగు, చౌటుప్పల్:** ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగుకే ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) ముత్యాల నాగరాజు సూచించారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలోని రైతు వేదికలో బుధవారం రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కందులు, మినుములు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను ఎంచుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ సకాలంలో విత్తనాలు వేసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో శ్రీలత మాట్లాడుతూ.. ప్రతి రైతు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని పొదుపు చేస్తూ పంటలకు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంతంగి సర్పంచ్ కాకి శ్రీలత సుందర్, రెడ్డిబావి సర్పంచ్ నందగిరి వెంకట్, ఉప సర్పంచ్ బోయ సదానందం, సత్యనారాయణ, ఏపీఎం ఈశ్వర్, ఏఈఓలు వెన్నెల, వీణ కుమారి, లక్ష్మణ్, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి పద్మజ, పలువురు రైతులు పాల్గొన్నారు.





# వర్షాభావాన్ని ఎదుర్కొందాం.. ఆరుతడి పంటలు వేద్దాం!

- మూడు రోజుల్లో అందుబాటులోకి విత్తనాలు: ఏవో పద్మజ
- పాముకుంట రైతు వేదికలో ప్రత్యేక అవగాహన సదస్సు

**తొలివెలుగు, రాజాపేట:** ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమిష్టిగా అధిగమిద్దామని, రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి (ఏవో) పద్మజ సూచించారు. బుధవారం రాజాపేట మండలం పాముకుంట రైతు వేదికలో క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మరో మూడు రోజుల్లో ఆరుతడి పంటల విత్తనాలు రైతులకు అందుబాటులోకి రానున్నాయని, వాటితో సేద్యం చేసి నష్టాల నుంచి గట్టెక్కాలని కోరారు. తక్కువ నీటితో పండే ఉలవలు, నువ్వులు, జొన్నలు వంటి పంటలను ఎంచుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రేణికుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, పాముకుంట సర్పంచ్ రంగ నరేష్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధిలో అధికారులదే కీలక పాత్ర

- రాజాపేటలో ప్రాధాన్యంగా సాగిన సర్వసభ్య సమావేశం
- గ్రామసభలకు అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి: దేవ్ సింగ్




**తొలివెలుగు, రాజాపేట:** గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో ప్రభుత్వ అధికారుల పాత్ర అత్యంత కీలకమని మండల ప్రత్యేకాధికారి దేవ్ సింగ్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజాపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కే. నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ) నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు. డీఆర్‌డీఓ నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై గ్రామ సర్పంచ్‌లకు వివరిస్తూ, వాటి ఫలాలు క్షేత్రస్థాయిలోని ప్రతి లబ్ధిదారుడికి అందేలా చూడాలని సూచించారు. అనంతరం ప్రత్యేకాధికారి దేవ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతినెల జరిగే గ్రామసభలకు అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీఓ ఆవుల కిషన్, పర్యవేక్షకుడు అల్లం ఇన్నారెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# గురుదేవో భవ.. ఉపాధ్యాయులకు ఘన సత్కారం!

- శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో వేడుకలు
- చేనేత శాలువాలతో సన్మానించిన ఆలయ నిర్వాహకులు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో బుధవారం గురు పౌర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న పలువురు ఉపాధ్యాయులకు, విద్యాశాఖ అధికారులకు ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అర్చక స్వామి చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ గురువులకు వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఎంఈఓ చందా రమేష్, రాజాపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తడ్క రాజు, మాశెట్టి శ్రీనివాసులు, నమిల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు నమిల భరత్ కుమార్ గౌడ్, ఉపాధ్యాయులు గౌటే బాలరాజు, పాముకుంట ఉపాధ్యాయుడు బాలరాజులను ఆలయ నిర్వాహకులు చేనేత శాలువాలతో ఘనంగా సత్కరించారు.



# ఆధ్యాత్మిక శోభతో గురు పౌర్ణమి వేడుకలు





- భక్తాంజనేయ స్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన, యజ్ఞం
- అంగరంగ వైభవంగా సాయిబాబా, దత్తాత్రేయునికి పూజలు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయిబాబా, శ్రీ దత్తాత్రేయ స్వాములకు హారతి సమర్పించి, ప్రత్యేక యజ్ఞం చేపట్టారు. అనంతరం నిర్వహించిన లక్ష పుష్పార్చన కార్యక్రమం కన్నులపండువగా సాగింది. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజాదికాల అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున మహదన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బల్ల దుర్వాసులు, ఉపాధ్యక్షుడు సకినాల నాగయ్య, ప్రధాన కార్యదర్శి జోగు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి వనం ఉపయాకర్, కోశాధికారి అంబటి భానుచందర్, ధర్మకర్తలు కొంక వీరేశం, విడం చక్రపాణి, బైర లక్ష్మయ్య, సామల కైలాసం, గర్దాసు ఉప్పలయ్య, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ, ఎరవ విగ్నేష్, ఆడెపు ఎల్లమ్మ, గంజి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు

- శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు, అన్నదానం
- కన్నులపండువగా పల్లకి సేవ, పాదుకా పూజలు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని మహిమాన్విత శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలను ఆలయ ట్రస్టు అభివృద్ధి సేవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వైదిక కార్యక్రమాలు నిర్వహించగా, శాశ్వత గౌరవ అధ్యక్షుడు నంగునూరు చంద్రశేఖర్ గుప్తా పర్యవేక్షణలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం పూజాదికాలు చేపట్టింది. ఉదయం షిరిడీ సాయిబాబా మూర్తికి పంచామృత అభిషేకాలు, గురు పాదుకార్చనలు, తీర్థ పూజలు జరిపారు. అనంతరం పుర వీధుల్లో నిర్వహించిన సాయిబాబా పల్లకి సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహదాశీర్వచనం అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ



సందర్భంగా ఆలయ అర్చకుడు వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మను నంగునూరు రాజు-రితిక దంపతులు సత్కరించారు. అలాగే రేణికుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గుర్రం



నర్సింలు, పిట్టల జయరాములు, మల్లాగూడెం సర్పంచ్ చెర్లపల్లి బాలరాజు రెడ్డి తదితరులను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.




# కాల్వపల్లి.. ప్రగతికి సరికొత్త చిరునామా!

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవతో వేగంగా అభివృద్ధి పనులు
- సర్పంచ్ ఇంజ లక్ష్మి, కాంగ్రెస్ నేత ఇంజ నరేష్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలంలోని కాల్వపల్లి గ్రామం అభివృద్ధి బాటలో వేగంగా ముందుకు సాగుతోంది. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవతో గ్రామంలో పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచ్ ఇంజ లక్ష్మి ఆధ్వర్యంలో పాలకవర్గం, గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, ఎస్సీ కమ్యూనిటీ హాల్, మహిళా సంఘ భవనం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కేంద్రం నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. అలాగే గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఇంటింటికి చెత్తబుట్టల పంపిణీ, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం ప్రతి శుక్రవారం వారసంత (కూరగాయల మార్కెట్) నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గ్రామాభివృద్ధిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సర్పంచ్ ఇంజ లక్ష్మితో పాటు ఆమె కుమారుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్ నిరంతరం కృషి చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# వరుణుని కరుణకై.. ముకుమ్మడి పూజలు

- బొందుగులలో బొడ్రాయి, ఈశ్వరుడికి అభిషేకాలు
- భక్తిశ్రద్ధలతో వర్షాలకై వేడుకున్న గ్రామస్తులు

**తొలివెలుగు, రాజాపేట:** గ్రామ సస్యశ్యామలానికి సకాలంలో వర్షాలు కురవాలని కాంక్షిస్తూ రాజాపేట మండలంలోని బొందుగుల గ్రామస్తులు ఏకమయ్యారు. బుధవారం గ్రామంలోని బొడ్రాయితో పాటు స్థానిక శివాలయంలో పరమేశ్వరునికి ముకుమ్మడిగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ పురోహితులు వేదాటి సత్యనారాయణ శర్మ, శివాలయ అర్చకులు బొమ్మ కిషోర్ కుమార్ల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి. స్థానిక సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య మొదటగా స్వామివారికి నీళ్లు పోసి అభిషేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ పరమేశ్వరుని అనుగ్రహంతో సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, వర్షాభావ పరిస్థితులు తొలగిపోవాలని గ్రామస్తులంతా వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు, పురోహితులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సమృద్ధిగా వర్షాలు కురవాలి.. రైతన్నలు సుభిక్షంగా ఉండాలి





- బోగారంలో భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల పూజలు
- పాల్గొన్న సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, మహిళలు, గ్రామస్థులు

**తొలివెలుగు, రామన్నపేట:** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ రామన్నపేట మండలం బోగారం గ్రామంలో బుధవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో, గ్రామపంచాయతీ పాలకవర్గం సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని శ్రీ నాభిశిల బొడ్రాయి వద్దకు మహిళలు ప్రతి ఇంటి నుంచి బిందెలతో నీరు, ఆవుపాలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు ఊరేగింపుగా తీసుకువచ్చారు. బొడ్రాయికి జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని, ప్రకృతి అనుకూలించి వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదాపూర్ లో 5 ఎకరాల భూ కబ్జా




**హైదరాబాద్, మాదాపూర్:** ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం. అక్రమంగా చెరువుల్లో నిర్మాణాలు కూల్చివేస్తుంటే.. మరోవైపు బడాబాబులు.. పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు.. ఎఫ్టిఎల్ ఖీూ లిమిట్లోఉన్నా కూడా.. భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. మాదాపూర్‌లో సర్వే నెంబర్ 65.. గల..ఐటీసీ కోహినూర్ హోటల్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో గత 20 ఏళ్లుగా జీవనోపాధి సాగిస్తున్న దుకాణాలను తొలగించి, ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని 5 ఏళ్లుగా ప్రెసిడెంట్ గా వ్యవహరిస్తున్న కదారి గంగారం యాదవ్ ఆవేద వ్యక్తం చేస్తున్నారు.. , హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని, అక్రమంగా షాపులను తొలగించే చర్యలను వెంటనే నిలిపివేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, ప్రజాస్వామ్యంలో న్యాయస్థానాల తీర్పులకు గౌరవం ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# విద్యుత్ వ్యవస్థను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలి

- బాధ్యతగా పనిచేయకపోతే రాజీనామా చేసి వెళ్లండి: అధికారులతో ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి
- ఎల్‌నినో దృష్ట్యా సాగునీటికి ఇబ్బంది లేకుండా నిరంతర విద్యుత్ అందించాలి
- ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌తో ఫోన్లో సంభాషణ





**తొలివెలుగు, మునుగోడు:** మునుగోడు నియోజకవర్గాన్ని విద్యుత్ సరఫరాలో రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి సూచించారు. మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున మునుగోడు ప్రాంతంలో వ్యవసాయం ప్రధానంగా బోరుబావులపైనే ఆధారపడాల్సి వస్తుందని అన్నారు. రైతులకు సాగునీటి సమస్య తలెత్తకుండా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే బాధ్యతతో పనిచేయాలని, పని వాతావరణం కల్పించే బాధ్యత తనదైతే, విధులను నిర్లక్ష్యం చేసే వారు పదవుల్లో కొనసాగే అవసరం లేదని హెచ్చరించారు. మొదట మండల కేంద్రాల్లో గృహాలపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించి భద్రతాయుతంగా లైన్లను మార్చాలని, అనంతరం గ్రామాలు, వ్యవసాయ విద్యుత్ లైన్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అవసరమైన నిధుల సమీకరణ బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు. సమీక్షలో నియోజకవర్గంలో ప్రస్తుతం 31 సబ్‌స్టేషన్లు పనిచేస్తుండగా, కొత్తగా 6 సబ్‌స్టేషన్లు వినియోగంలోకి వచ్చినట్లు అధికారులు వివరించారు. మరో 3 సబ్‌స్టేషన్లు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, 6 సబ్‌స్టేషన్లు టెండర్ దశలో, మరో 3 సబ్‌స్టేషన్లు భూకేటాయింపు దశలో ఉన్నట్లు వెల్లడించారు. వివిధ దశల్లో ఉన్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆదేశించారు. లో-వోల్టేజీ సమస్యలు, మంజూరైన సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల పురోగతిపై ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం పని ఒత్తిడితో అస్వస్థతకు గురైన మునుగోడు ఏఈ నరేందర్‌ను ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్ఈ సురేష్, నల్గొండ కన్‌స్ట్రక్షన్ డివిజన్ డీఈ నరసింహ, దేవరకొండ డీఈ బాల్య నాయక్, నల్గొండ డీఈ విద్యాసాగర్, చౌటుప్పల్ డీఈ మల్లికార్జున్, నాంపల్లి, మునుగోడు, చౌటుప్పల్ ఏడీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ లీకేజీ నిరోధక బిల్లును వ్యతిరేకించడం బాధ్యతారాహిత్యం

- విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న ప్రతిపక్షాలు
- బీజేపీ రామన్నపేట మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి



**తొలివెలుగు, రామన్నపేట:** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేపర్ లీకేజీ నిరోధక బిల్లును కాంగ్రెస్ పార్టీతో పాటు ఐ.ఎన్.డి.ఐ.ఎ కూటమి ఎంపీలు వ్యతిరేకించడం అత్యంత సిగ్గుచేటని భారతీయ జనతా పార్టీ రామన్నపేట మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నీట్ సహా వివిధ పోటీ పరీక్షల పేపర్ లీకేజీలపై గళమెత్తిన ప్రతిపక్షాలు, ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్తును రక్షించేందుకు కఠిన చట్టాన్ని తీసుకువస్తే అడ్డుకోవడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. భారతదేశ చరిత్రలోనే అత్యంత కఠినమైన యాంటీ పేపర్ లీక్ బిల్లును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ చట్టం ప్రకారం లీకేజీలకు పాల్పడే వారికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారని, వ్యవస్థీకృత ముఠాలపై కనీసం 7 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని వివరించారు. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఆధారంగా రాజకీయాలు చేయడం మాని, దేశ ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు.




# ప్రత్యామ్నాయ పంటలతోనే రైతన్నకు భరోసా

- తక్కువ నీటితో లాభదాయక సాగు చేపట్టాలి
- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తత అవసరం: సిరిగిరెడ్డి మల్లారెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట:** ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లాలని వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి సూచించారు. రామన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల సాగు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ, తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే నష్టాల నుంచి గట్టెక్కవచ్చున్నారు. సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా జొన్నలు, పెసలు, మినుములు, కంది, ఆముదం వంటి పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు, ఆదాయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సత్తయ్య, నాగు, అంజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా హరిదీప్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- వైబీఆర్ ఫంక్షన్ హాల్లో కేక్ కట్ చేసిన నేతలు
- హాజరైన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని వైబీఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, జిల్లా నాయకుడు యాస ఇంద్రారెడ్డి, కోరే భిక్షపతి, లగ్గాని రమేష్ గౌడ్, స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి, నాయకులు యాస కవిత, సోలిపురం అరుణ, గడ్డం దశరథ గౌడ్, పంజాల వెంకటేశం, కాలే మల్లేష్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, యూత్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు కాంగ్రెస్ పాలనలోనే కొండంత అండ

- బాధితుడి కుటుంబానికి రూ.3 లక్షల ఎల్ఓసీ అందజేత
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఆపదలో ఉన్న బాధితులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. భూదాన్ పోచంపల్లి పురపాలక పరిధిలోని 4వ వార్డుకు చెందిన మధిర పరమేష్ తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రభుత్వం నుంచి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.3 లక్షల విలువైన ఎల్ఓసీ చెక్కును బుధవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపద సమయాల్లో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గునీగంటి వెంకటేష్ గౌడ్, నాయకులు కుక్క కుమార్, పోతగల్ల శ్రీనివాస్, పోతగల్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లాయిపల్లి యాదవ సంఘం అధ్యక్షుడిగా మహేష్

- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక
- యాదవ సంఘం సర్వసభ్య సమావేశంలో నిర్ణయం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు, సభ్యులంతా చర్చించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అందెల మహేష్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా కన్నె రవీందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా లంక భాస్కర్ యాదవ్, సహాయ కార్యదర్శిగా మచ్చేందర్ యాదవ్, కోశాధికారిగా అందెల భాస్కర్ యాదవ్ ఎంపికయ్యారు. అలాగే కార్యనిర్వాహక కార్యదర్శిగా నరసింహ యాదవ్, గౌరవ సలహాదారులుగా అందెల శ్రీనివాస్ యాదవ్, అందెల జంగయ్య యాదవ్, కార్యవర్గ సభ్యులుగా అందెల రాజు యాదవ్, కొత్త గొల్ల రాములు యాదవ్, అందెల మహేందర్ యాదవ్, ఇట్టమోని సురేష్ యాదవ్‌లు ఎన్నికైనట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# మూసి విషజలాలతో రైతన్నల రోదన!

- ప్రాణాలను పణంగా పెట్టి కాలువ దాటుతున్న మునిపంపుల రైతులు
- ఆసిఫ్‌నగర్ కాలువపై వెంటనే వంతెన నిర్మించాలి: కత్తుల కాన్షీరామ్

**తొలివెలుగు, రామన్నపేట:** హైదరాబాద్ నుంచి పారుతున్న మూసి కలుషిత నీటితో ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటున్నాయని బీఎస్పీ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వలిగొండ సమీపంలోని ఆసిఫ్‌నగర్ కాలువ ప్రాంతాన్ని బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ మాట్లాడుతూ... మునిపంపుల గ్రామానికి చెందిన 500 ఎకరాల సన్నకారు రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే రోజూ కాలువ దాటక తప్పడంలేదన్నారు. వర్షాకాలంలో నీటి ఉద్ధృతి పెరిగి కాలువ దాటడం ప్రాణసంకటంగా మారుతోందని, మురికి నీటి కారణంగా విషజంతువులు పెరిగి రైతులు తీవ్ర భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ల కోసం వచ్చి వంతెన నిర్మిస్తామని హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు గెలిచాక రైతుల గోడు పట్టించుకోవడం లేదని నిలదీశారు. వెంటనే కాలువపై శాశ్వత వంతెన నిర్మించి, నీటి శుద్ధికి చర్యలు తీసుకోకపోతే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార శేఖర్, ఉపాధ్యక్షుడు పావురాల నరసింహ యాదవ్, నాయకుడు బెల్లి మల్లయ్య గౌడ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# బండ్లగూడలో మహిళ అదృశ్యం

- ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాని లక్ష్మి
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నాగోలు పోలీసులు



**తొలివెలుగు, నాగోలు:** నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ ప్రాంతానికి చెందిన కె. నారాయణ భార్య కె. లక్ష్మి (39) గత కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతోంది. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త నారాయణ నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అదృశ్యమైన మహిళ ఎత్తు సుమారు ఐదు అడుగులు, గోధుమ వర్ణం, సన్నటి శరీరాకృతి, గుండ్రటి ముఖం, నల్లటి జుట్టు కలిగి ఉంది. అదృశ్యమైన సమయంలో ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్నట్లు తెలిపారు. సదరు మహిళ ఆచూకీ తెలిసిన వారు వెంటనే నాగోలు పోలీస్ స్టేషన్‌ను లేదా 9676175912 నంబర్‌ను సంప్రదించి సమాచారం అందించాలని నాగోలు ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ విజ్ఞప్తి చేశారు.ది

# లింగోజిగూడలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటన

- భాగ్యనగర్ కాలనీలో నిల్వ నీటి సమస్యకు తక్షణ పరిష్కారం
- డ్రైనేజీ ట్రంక్‌లైన్ పరిశీలించి చెత్త తొలగించిన అధికారులు



**తొలివెలుగు, ఎల్బీనగర్:** లింగోజిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బుధవారం అక్కడ పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. నిల్వ నీటిని తొలగించినప్పటికీ మళ్లీ అదే ప్రాంతంలో వరద నీరు చేరుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సుధీర్ రెడ్డి వెంటనే వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇంద్రనగర్ నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ వరకు ఉన్న ట్రంక్‌లైన్‌ను పరిశీలించాలని ఆదేశించారు. అధికారులు డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించగా, పలు చోట్ల చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడినట్లు గుర్తించారు. అనంతరం మ్యాన్‌హోల్స్‌లోని చెత్తను తొలగించడంతో భాగ్యనగర్ కాలనీలో నిల్వ ఉన్న వర్షపు నీరు సాఫీగా వెళ్లింది. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా మ్యాన్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ సీనియర్ నాయకుడు తిలక్‌రావు, కాలనీ అధ్యక్షుడు రాము, జనరల్ సెక్రటరీ జగన్నాథ్ రెడ్డి, రాజు యాదవ్, జగన్మోహన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్భిక్ష పర్వం

ఈ ఏడాది వానలు ముఖం చాటేస్తున్నాయి. రైతుల కళ్లల్లో దిగులు మబ్బులు కనిపిస్తున్నాయే గాని, ఎక్కడా చినుకుల సవ్వడి వినిపించడం లేదు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకుంటే, చాలినన్ని తిండి గింజలు పండక కరవు కాటకాలు తప్పవు. అనావృష్టి తెచ్చిపెట్టే కరవు కాటకాలు సామాన్యుల బతుకులను దుర్భరం చేస్తాయి. ప్రధానంగా మనది వ్యవసాయాధారిత దేశం. వ్యవసాయాన్నే నమ్ముకుని, దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న కర్షక జనాభా వర్షాభావం వల్ల కష్టాల్లో పడితే, యావత్ దేశానికే కష్టాలు తప్పవు. వర్షాల కోసం క్రమం తప్పక యజ్ఞయాగాదులు చేసే సంస్కృతి మనది. వర్ష ప్రాధాన్యం పట్ల ఎరుక కలిగిన జాతి మనది. ‘అనావృష్టి మతీత్యైవ మహతీ వర్షసంతతిః/ భూతానాం సంక్షయం చక్రే దుర్భిక్ష పరిపీడితమ్’ అని విష్ణుపురాణం చెబుతోంది. అనావృష్టి వల్ల పంటలు పండక దుర్భిక్షంతో మనుషులే కాదు, సమస్త ప్రాణులూ సంక్షోభానికి, నాశనానికి లోనవుతాయి. కరవు కాటకాలు మన దేశానికి కొత్త కాదు. వానలు లేక, నేల నెర్రెలు పడిన దుర్భర దుర్భిక్ష వర్ణనలు మన పురాణ సాహిత్యం మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకు చాలానే ఉన్నాయి. ‘అదే పెన్న! అదే పెన్న!/ నిదానించి నడు/ విదారించు నెదన్, వట్టి/ ఎడారి తమ్ముడు!’ అంటూ ‘పెన్నేటి పాట’ రాసిన విద్వాన్ విశ్వం ఒకనాటి రాయలసీమ కరవు దృశ్యాన్ని హృదయ విదారకంగా చిత్రించారు. కరవు కాటకాలను ముందుగా తెలుసుకునే సాంకేతికత ఇదివరకు ఉండేది కాదు. అందువల్ల దుర్భిక్షాన్ని దైవఘటనగానే పరిగణించేవారు. ఇటీవలి కాలంలో సాంకేతిక పెరిగింది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితు లను; అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానుల వంటి ప్రకృతి విపత్తులను ముందు గానే గ్రహించి, వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేయగలుగుతున్నారు. పాలకులు బాధ్యతనెరిగిన వారైతే, వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికలను పట్టించుకుని కార్యాచరణను ప్రారంభిస్తారు. పాలకులు బాధ్యతను మరచి, హాలికులను వారి కర్మానికి వారిని విడిచిపెడితే, దుర్భిక్ష పర్యవసానాలు మరింత దుర్భరంగా ఉంటాయి.

# నెగ్గాల్సిన ఇతర పరీక్షలు

యాభై రోజులుపైగా ఢిల్లీలో మహోధృతంగాసాగి, దేశం మొత్తాన్ని సుడిగాలిలా చుట్టేసిన జంతర్ మంతర్ ఉద్యమం ఉపశమించిన మర్నాడే ప్రధాని నరేంద్ర మోదీ పరీక్షల సంస్కరణల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని ఆధ్వర్యాన ఆరుగురు సభ్యుల టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమిస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. అంతేకాదు... పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పబ్లిక్ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లును లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టారు. కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో మొదలెట్టి చకచకా సాగుతున్న ఈ పరిణామాలు... ఆగ్రహంతో రగులుతున్న జెన్ జీ తరాన్ని దగ్గర చేసుకోవటానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాల పర్యవసానమే. నీట్ పేపర్ లీకయిందనీ, మరోసారి ఆ పరీక్ష నిర్వహణ తప్పదనీ తేలిన వెంటనే ఇంతే వేగంగా స్పందించివుంటే బహుశా ఈ స్థాయిలో ఆందోళన జరిగివుండేది కాదేమో! ఆ మాటకొస్తే ఎన్నో యేళ్లుగా ఈ లీకులు వినబడుతూనే ఉన్నాయి. కానీ వ్యవస్థల్లో కదలిక లేదు. 2024 నీట్ ప్రశ్నపత్రం లీక్ తర్వాత మాత్రం ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటైంది. అది ఇచ్చిన నివేదిక అతీగతీ ఏమైందో తెలియదు. ఇంత నిస్తేజంగా ప్రభుత్వాలున్నప్పుడు ఉద్యమాలు వెల్లువెత్తడంలో ఆశ్చర్యం లేదు. మన దేశంలో సమస్యేమంటే కేంద్రం ఒక్కటే కాదు... రాష్ట్ర ప్రభుత్వాలు సైతం లీకుల విషయంలో నిర్లిప్తంగానే ఉంటాయి. జంతర్ మంతర్ ఉద్యమం ఒకపక్క సాగుతుండగానే పంజాబ్‌లో ఫార్మసీ రిక్రూట్‌మెంట్ పరీక్షల అక్రమాలు బయటపడ్డాయి. ఇక ఎన్డీయే కూటమి ఏలుబడిలోనే సాగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియే పెద్ద కుంభకోణంగా మారింది. నోటిఫికేషన్ విడుదలనాడే స్పోర్ట్స్ కోటా నియామకాలకు అర్హత పరీక్ష అవసరం లేదంటూ రెండు జీవోలు తీసుకురావటం ఆ ప్రభుత్వ బరితెగింపునకు చిహ్నం. అందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం ఏపీ విద్యామంత్రి లోకేశ్ రాజీనామా చేయాలన్న డిమాండ్ బలంగా వినిపించింది. నందన్ నిలేకని విద్యాధికుడు. ఐటీ రంగంలో పేరెన్నికగన్నవారు. గతంలో మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వం దేశంలో




సంక్షేమ పథకాల అమలుకోసమంటూ తీసుకొచ్చిన ఆధార్ కార్డుల రూపకర్త ఆయనే. నిలేకని మాదిరే ఇతర సభ్యులు సైతం వారి వారి రంగాల్లో నిష్ణాతులు. పరీక్షల నిర్వహణకు ఇప్పుడ నుసరిస్తున్న విధానాల్లోని లోటుపాట్లు అధ్యయనం చేసి, ఎలాంటి సంస్కరణలు అవసరమో వీరు సూచిస్తారు. అడుగడుగునా చోటుచేసుకోవటానికి ఆస్కారం ఉన్న అవకతవకలనూ, అనైతిక పద్ధతులనూ నివారించటానికి ఏం చేయాలో చెబుతారు. వీటన్నిటికన్నా ముందు అసలు పరీక్ష నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వంటి జాతీయ సంస్థ అవసరమా అనే సంగతి నిగ్గుదేల్చటం అవసరం. ఒక సంస్థకు దాని సామర్థ్యానికీ, వనరులకూ మించిన బాధ్యతల్ని అప్పగించటం సరైందేనా? ఆలోచించాలి. రెండేళ్లనాటి రాధాకృష్ణన్ కమిటీ నివేదికలోని అంశాలేమిటో, దాని సిఫార్సులపై తీసుకున్న చర్యలేమిటో చెప్పాల్సిన బాధ్యత పాలకులకు లేదా? కాక్రోచ్ ఉద్యమం సాగుతుండగానే 2024 నీట్ లీక్ ప్రధాన నిందితుడిపై వచ్చిన ఆరోపణలు రుజువు కాలేదని సీబీఐ ప్రకటించటం మరో వైచిత్రి. ఇక విద్యార్థులపై అత్యంత ఘోరంగా బలప్రయోగానికి పూనుకున్నవారిపైనా చర్యలుండాలి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఇకపై అవసరమైన చర్యలు నిరంతరం తీసుకుంటూనే ఉంటుందని ప్రధాని చెప్పటం హర్షించదగ్గది. ఇది కేంద్ర స్థాయిలో మాత్రమే కాదు... రాష్ట్రాల స్థాయిలో కూడా జరగాలి. ఇతర రాష్ట్రాల మాటెలవున్నా తమ ఏలుబడిలోని ప్రభుత్వాలైనా జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ఎన్డీయే పెద్దలకుంది. ప్రధాని హామీ కంటితుడుపు చర్య మాత్రమేనని, రాష్ట్రాల్లో కూడా కాక్రోచ్‌ల స్థాయిలో ఉద్యమిస్తే తప్ప డీఎస్సీ అవకతవకల వంటివి పట్టించుకోబోరన్న సంకేతాలు వెళ్లరాదు. అందుకే దేశంలో యువత మనసు గెలవాలంటే నెగ్గాల్సిన పరీక్షలు చాలానే ఉన్నాయని కేంద్రం గుర్తించాలి.



# ‘సంపూర్ణ క్రాంతి’ సైరన్!

“పదండి ముందుకు, పదండి తోసుకు -- ప్రభంజనం వలె హోరెత్తండి”... శ్రీశ్రీ కవితావేశానికి దృశ్యరూపంలా కనిపించింది ‘కాక్రోచ్’ల కదనోత్సాహం. ఎండుగడ్డి మైదానంలో నిప్పు రవ్వలా నిద్రాణమైన జన చేతనను రగిలించగలిగింది. 1974లో స్వాతంత్ర్య సమరయోధుడు జేపీ నాయకత్వంలో నడిచిన ‘సంపూర్ణ క్రాంతి (టోటల్ రివోల్యూషన్) ఛాయలు ఈ ఉద్యమంలో ప్రస్ఫుటంగా కనిపించాయి. నిరంకుశ పాలన వైపు అడుగులేస్తున్న అధికార కూటమికీ, పక్షవాతం సోకిన ప్రధాన ప్రతిపక్షానికీ కాక్రోచ్ ఉద్యమం గట్టి సవాల్‌నే విసిరింది. ఉద్యమ స్వభావాన్ని, దాని గమనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక సమయంలోనే గుర్తించగలిగారు. ఫలితంగా శనివారం మధ్యాహ్నం విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని ఆయనే వ్యక్తిగతంగానే తీసుకున్నారని జాతీయ మీడియాకు లీకులందాయి. బహుశా ఆయన ప్రతిష్ఠను నిలబెట్టడం కోసం వీటిని ప్రసారం చేసి ఉండవచ్చు. భారతీయ జనతా పార్టీ ఎన్నికల విజయాల కీలక పాత్రధారుల్లో ధర్మేంద్ర ప్రధాన్ కూడా ఒకరు. ఆయన గౌరవాన్ని కాపాడటం పార్టీ బాధ్యత కూడా. సంపూర్ణ క్రాంతి ఉద్యమం మాదిరిగా దేశ వ్యాప్తంగా విస్తరించే లక్షణాలను కాక్రోచ్ ఉద్యమంలో గుర్తించి నందువల్ల దీనికి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలని ప్రధాని భావించి నట్టు సమాచారం. ధరేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను తొలి దశలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రజా ఉద్యమాలకు తలొగ్గి నిర్ణయాలను మార్చుకునే లక్షణం పన్నెండేళ్ల పాలనా కాలంలో ఎన్డీఏకు ఎప్పుడూ లేదు. వ్యవసాయ చట్టాలకు వ్యతి రేకంగా పంజాబ్ రైతులు చేసిన చరిత్రాత్మక పోరాటంపై స్పందించడానికి మోదీ సర్కార్ సుదీర్ఘ సమయాన్ని తీసు కున్నది. అంతర్జాతీయ క్రీడా యవనికపై దేశ ప్రతిష్ఠను ఇనుమ డింపజేసిన మహిళా మల్లయోధుల ఆక్రందన అరణ్యరోదనగా మారింది తప్ప ఎన్డీఏ సర్కార్ చలించలేదు. పౌరసత్వ చట్టం దగ్గర నుంచి అనేకానేక అంశాల్లో కేంద్రం ప్రజా ఉద్యమాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. ‘కాక్రోచ్’ల పార్లమెంట్ ముట్టడి జరిగిన మూడు రోజుల్లోనే ప్రధానమంత్రి రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలను చేపట్టారు. ఈ నెల 23న ఆందోళనపై తొలిసారిగా ఆయన నోరు విప్పారు. పేపర్ లీకేజీ ఘటనల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు లను ఏర్పాటు చేస్తున్నట్టు అర్ధరాత్రి ట్వీట్ చేశారు. విద్యార్థుల సంక్షేమం, వారి భవితవ్యం కంటే ఇంకేదీ ముఖ్యం కాదని కూడా అందులో పేర్కొన్నారు. 24న జరిగిన కేబినెట్ సమావేశంలో ఇటువంటి నేరాలకు సంబంధించి చట్టానికి మరింత పదును పెడుతూ తీర్మానించారు. సీజేపీ ప్రతినిధులు పెట్టిన గడువు లోపల 25 మధ్యాహ్నం మంత్రి రాజీనామా నిర్ణయం వెలువడింది. ఈ మూడు రోజులుగా కేంద్రమంత్రులు సీజేపీ ప్రతి నిధులతో చర్చలు జరుపుతూనే ఉన్నారు. సీజేపీ పెట్టిన డిమాండ్లలో మంత్రి రాజీనామా ముఖ్యమైనది. ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వడం, ఆందోళనలో పాల్గొన్న వారిపై కేసులు ఎత్తివేయడం మిగిలిన రెండు డిమాండ్లు. వీటిని కూడా కేంద్రం అంగీకరించినట్టు సమాచారం. విద్యార్థులపై జరిగిన పాశవిక లాఠీచార్జికి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని తాజాగా సీజేపీ డిమాండ్ చేసింది. మంత్రి రాజీనామాతో యువజనోద్యమం ముగిసిపోలేదనీ, విద్యావ్యవస్థ ప్రక్షాళన జరిగేవరకూ కొనసాగు తుందనీ కాక్రోచ్ ప్రతినిధులు విజయోత్సవం సందర్భంగా ప్రకటించారు. అయితే ప్రస్తుతం జంతర్ మంతర్ దగ్గర జరుగుతున్న ధర్నా, దీక్షా కార్యక్రమాల విరమణపై నిర్ణయం వెలువడాల్సి ఉన్నది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం కంటే ఎక్కువగా అప్రదిష్ట మూటకట్టుకున్నది గోదీ (పెంపుడు) మీడియా. ఎన్డీఏ కూటమిలో అప్రకటిత భాగస్వాములుగా పెంపుడు మీడియా, యెల్లో మీడియా వగైరాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. జూలై 20న జరిగిన కాక్రోచ్‌ల పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం పెంపుడు మీడియాను దిగ్భ్రాంతికి గురిచేసింది. దేశం నలుమూలల నుంచి లక్షలాది యువజనం తరలి వస్తారని అది ఊహించలేకపోయింది. పోలీసు దమనకాండకు ఎదురొడ్డి నిలబడతారని కూడా అంచనా వేయలేకపోయింది. ఈ ఉలికి పాటు నుంచి తెప్పరిల్లిన తర్వాత సన్నాయి నొక్కులు ప్రారంభించింది. తరలివచ్చిన ఝుంఝుమారుత యువ కెరటాలను ‘నీట్ పరీక్ష’ పరిధిల్లోనే బంధించడానికి తాపత్రయపడింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తున్నప్పటికీ ఆందోళన కొనసాగించడంలో అర్థం లేదని ధర్మపన్నాగాలను వల్లె వేసింది. జవాబుదారీతనం ఒక కనీస ప్రజాస్వామిక ధర్మమనే విషయాన్ని విస్మరించి మంత్రి రాజీనామా డిమాండ్‌ను తప్పుపట్టింది. తాడూ బొంగరం లేని పార్టీ పిలుపునిస్తే ఇంత జనసందోహం పోగవడం వెనుకనున్న ‘అదృశ్య శక్తుల’ కోసం ఆరా తీయడం మొదలుపెట్టింది. మీడియా పక్షపాతాన్ని నిలదీసిన యువకులను అరాచక శక్తులుగా చిత్రించారు.

# జీడీపీ బాగా తగ్గొచ్చు: రాయిటర్స్ సర్వే




## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

ముంబై, జూలై 29: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. బ్లూచిప్ సంస్థల షేర్ల నుంచి లభించిన మద్దతుతోపాటు విదేశీ మదుపర్లు పెట్టుబడులు పెట్టడంతో ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా ఎగబాకాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 888.68 పాయింట్లు లేదా 1.16 శాతం ఎగబాకి 77,654.60 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 264.85 పాయింట్లు లేదా 1.10 శాతం అందుకొని 24,250.20 వద్ద ముగిసింది. వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వు నిర్ణయానికి ముందు మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయని జియోజిట్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.




## అదానీ పోర్ట్స్ లాభం 10 శాతం అప్

న్యూఢిల్లీ: దేశీ ప్రైవేటు పోర్ట్స్ దిగ్గజం అదానీ పోర్ట్స్ (ఏపీసెజ్) ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. అంతర్జాతీయ పోర్టుల, మెరైన బిజినెస్‌ల జోరు, దేశీ పోర్టుల స్థిరమైన పనితీరుతో ఈ ఏడాది తొలి త్రైమాసికం (2026--26, క్యూ1)లో కంపెనీ రూ. 3,650 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన రూ.3,311 కోట్లతో పోలిస్తే లాభం 10.23 శాతం జంప్ చేసింది. మొత్తం ఆదాయం కూడా 24 శాతం వృద్ధితో రూ. 9,422 కోట్ల నుంచి రూ. 11,674 కోట్లకు ఎగబాకింది. మరోపక్క, కంపెనీ వ్యయాలు రూ.5,732 కోట్ల నుంచి రూ. 7,079 కోట్లకు పెరగడం గమనార్హం. 'అన్ని వ్యాపార విభాగాల్లో ఈ సమతుల్యమైన వృద్ధితో 2031 నాటికి కంపెనీ లక్ష్యాలను సాధించగలమన్న నమ్మకం మరింత బలపడింది. 2030 కల్లా దేశీ పోర్టుల హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని 1,000 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ)కు విస్తరించాలన్న టార్గెట్, అంతర్జాతీయ పోర్ట్‌ఫోలియో వృద్ధి, వేగంగా విస్తరిస్తున్న లాజిస్టిక్స్ ఎకోసిస్టమ్ దన్నుతో దీర్ఘకాలిక విలువను సృష్టించే సామర్థ్యం గల మరింత వైవిధ్యమైన, స్థిరమైన, ప్రపంచవ్యాప్తంగా అనువైన రవాణా ప్లాట్‌ఫామ్‌ను ఏపీసెజ్ నెలకొల్పుతోంది' అని కంపెనీ సీఈఓ అశ్వని గుప్తా పేర్కొన్నారు. క్యూ1లో అంతర్జాతీయ పోర్టుల నుంచి ఆదాయం 256 శాతం దూసుకెళ్లి రూ. 1,747 కోట్లకు చేరింది. దేశీ పోర్టుల ఆదాయం 12 శాతం వృద్ధి చెందింది. ఇక మెరైన్ వ్యాపార ఆదాయం 67 శాతం ఎగసి రూ. 901 కోట్లను తాకింది. కొత్త ఆఫ్‌షోర్ వెసల్స్ జోడింపు, యూరోపియన్ సబ్‌సీ విస్తరణ దీనికి దోహదం చేశాయి. కాగా, 2026--27 పూర్తి ఏడాదికి అదానీ పోర్ట్స్ రూ. 43,000--45,000 కోట్ల ఆదాయాన్ని, రూ. 25,000--26,000 కోట్ల ఎబిటాను అంచనా వేస్తోంది. జూన్ నాటికి కంపెనీ స్థూల రుణ భారం రూ. 56,776 కోట్లు కాగా, రూ. 12,428 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి.

## 'ఎస్ఎంఎల్'కు మహీంద్రా ట్రక్‌ల వ్యాపారం

ముంబై: ఆటో దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) తమ కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ట్రక్కులు, బస్సుల విభాగాన్ని (ఎంటీబీడీ) అనుబంధ సంస్థ ఎస్ఎంఎల్ మహీంద్రాకి బదలాయించనున్నట్లు వెల్లడించింది. ఈ డీల్ విలువ రూ. 525 కోట్లుగా ఉంటుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 7న ఒప్పందాలు (బీటీఏ) కుదుర్చుకోనుండగా, వచ్చే ఏడాది జనవరి నాటికి డీల్ పూర్తి కావచ్చని వివరించింది. పటిష్టమైన బ్రాండ్స్‌తో, విలీన సంస్థ, మార్కెట్లో శక్తివంతమైన పోటీదారుగా ఎదుగుతుందని ఎస్ఎంఎల్ మహీంద్రా చైర్మన్ వినోద్ సహాయ్ చెప్పారు. భవిష్యత్ వృద్ధి అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకుని లెక్కగట్టడం కాకుండా ప్రస్తుత వేల్యుయేషన్‌పై ఎస్ఎంఎల్ షేర్‌హోల్డర్లకు స్పష్టత ఉండేందుకు స్లంప్ సేల్ ప్రాతిపదికన ఈ డీల్ ఉంటుందని ఎంఅండ్ఎం సీఎఫ్‌వో అమర్‌జ్యోతి బారువా చెప్పారు. తేలికపాటి, మధ్య రకం వాణిజ్య వాహనాల రంగానికి చెందిన ఎస్ఎంఎల్ ఇసుజులో మహీంద్రా గతేడాది మెజారిటీ వాటాలను కొనుగోలు చేసి, పేరును ఎస్ఎంఎల్ మహీంద్రాగా మార్చింది. ఎస్ఎంఎల్ మహీంద్రా, ఎంటీబీడీ విలీనతో ఏర్పడే సంస్థవిస్తృత స్థాయి ఉత్పత్తుల శ్రేణితో దేశీయంగా నాలుగో అతి పెద్ద వాణిజ్య వాహనాల తయారీ దిగ్గజంగా ఎదగనుంది. 2030--31 ఆర్థిక సంవత్సరం నాటికి ఆదాయాలను రూ. 12,500 కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఈ రెండు సంస్థల ఆదాయం కలిపి సుమారు రూ. 6,000 కోట్లుగా ఉంటుంది. ఇరు సంస్థలు చేతులు కలపడం వల్ల మార్కెట్ వాటాలో నాలుగో స్థానానికి చేరవచ్చు. ఉమ్మడి వ్యాపారానికి 200 డీలర్‌షిప్‌లు, 650 టచ్‌పాయింట్లు ఉంటాయి. వచ్చే ఏడాదిన్నర వ్యవధిలో ఎస్ఎంఎల్ కొత్తగా 25 కొత్త డీలర్‌షిప్‌లు, 60 టచ్‌పాయింట్లను ఏర్పాటు చేయనున్నట్లు సహాయ్ చెప్పా రు. ఎలక్ట్రిక్ వాహనాలు, ఉత్పత్తుల శ్రేణి విస్తరణ, సామర్థ్యాలను పెంచుకోవడంలాంటి అంశాలపై విలీన సంస్థ దృష్టి పెడుతుంది.




# స్పోర్ట్స్



# గుల్వీర్ రజత చరిత్ర







గ్లాస్గో: ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు మరో రెండు రజతాలు లభించాయి. భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్, లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ వెండి పతకాలు అందుకున్నారు. ఆసియా గేమ్స్ కాంస్య పతక విజేత అయిన గుల్వీర్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో రజతం గెలిచి ఈ ఘనత సాధించిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డులకెక్కాడు. మంగళవారం అర్ధరాత్రి వర్షంతో తడిచిన ట్రాక్‌పై ప్రతికూల పరిస్థితుల్లో సాగిన పరుగులో ఆరంభం నుంచి ముందంజలో ఉన్న గుల్వీర్ కొద్దిలో స్వర్ణం చేజార్చుకున్నాడు. 27 నిమిషాల 49.78 సెకండ్ల టైమింగ్‌తో రెండో స్థానం సాధించి సిల్వర్ ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియా రన్నర్ కై రాబిన్సన్ 27 నిమిషాల 48.93 సెకండ్లతో గోల్డ్ అందుకున్నాడు. 2023 వరల్డ్ చాంపియన్‌షిప్ మెడలిస్ట్ డానియెల్ ఎబెన్యో (కెన్యా) సహా పలువురు మేటి ఆఫ్రికా రన్నర్లు బరిలో నిలిచిన పోటీలో గుల్వీర్ తెలివిగా పరుగెత్తాడు. వర్షంతో ట్రాక్ తడిసినా రేసులో చాలా భాగం వరకూ ముందు వరుసలోనే ఉం డి చివరి స్టేజ్‌లో టాప్-3లోకి దూసుకొచ్చాడు. ఆఖరి క్షణాల్లో డేవిడ్ ముల్లార్కే (ఐల్ ఆప్ మా న్)ను వెనక్కునెట్టి రెండో స్థానం అందుకున్నాడు. ములార్కే (27 ని 50.28 సె) కాంస్యం గెలిచాడు. ఇక, పురుషుల లాంగ్‌జంప్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన మురళీ శ్రీశంకర్ అంచనాలను అందుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి జరిగిన పోటీలో తన రెండో ప్రయత్నంలో 8.09 మీటర్ల దూరం దూకి రెండో స్థానం సొంతం చేసుకున్నాడు. కామన్వెల్త్‌లో అతనికిది రెండో సిల్వర్. గత ఎడిషన్‌లోనూ అదే పతకం గెలిచాడు. జమైకా జంపర్ తెజయ్ గేల్ అత్యధికంగా 8.15 మీటర్ల దూరంతో అగ్రస్థానంతో గోల్డ్ ఖాతాలో వేసుకోగా.. స్టీఫెన్ మెకంజీ (స్కాట్లాండ్) 8.08 మీటర్లతో కాంస్యం గెలిచాడు. మరో భారత అథ్లెట్ లోకేశ్ (7.97 మీ) ఐదో స్థానంతో సరిపెట్టాడు.

### పూజ, సంజన నిరాశ

మహిళల హైజంప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత అథ్లెట్, 19 ఏండ్ల పూజా సింగ్‌కు నిరాశే ఎదురైంది. తీవ్ర వర్షం మధ్య సాగిన ఫైనల్లో 1.82 మీటర్ల ఎత్తు దూకలేకపోయింది. ఆసియా చాంపియన్ అయిన పూజ తన తొలి కామన్వెల్త్ గేమ్స్‌ను పతకం లేకుండానే ముగించింది. ఇక, భారత్ పతకాల మోత మెగిస్తున్న వెయిట్‌లిఫ్టింగ్‌లో సంజన తీవ్రంగా నిరాశపరిచింది. మహిళల 77 కేజీల విభాగం ఫైనల్లో పోటీపడ్డ 19 ఏండ్ల సంజన స్నాచ్‌లో 94 కిలోల బరువును మూడు ప్రయత్నాల్లోనూ ఎత్తలేకపోయింది. ఫలితంగా పోటీని పూర్తి చేయలేకపోయింది.

### సెమీస్‌కు అనిమేశ్

పురుషుల 200 మీటర్ల స్ప్రింట్‌లో నేషనల్ రికార్డ్ హోల్డర్ అనిమేశ్ కుజుర్ సెమీఫైనల్ చేరుకున్నాడు. బుధవారం జరిగిన హీట్-4లో 23 ఏండ్ల కుజుర్ 20.46 సెకండ్లతో అగ్రస్థానం, ఓవరాల్‌గా ఏడో స్థానం సాధించి సెమీస్ బెర్తు అందుకున్నాడు.

### సజన్ ప్రకాశ్ ఫెయిల్

భారత స్టార్ స్విమ్మర్ సజన్ ప్రకాశ్ పురుషుల 200 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఫైనల్ చేరలేకపోయాడు. హీట్స్‌లో 1:51.99సె టైమింగ్‌తో 20వ స్థానంతో సరిపెట్టగా.. అనీశ్ (1:51.88 సె)18వ స్థానంతో హీట్స్‌లోనే ఇంటిదారి పట్టాడు. పురుషుల 50 మీటర్ల బటర్‌ఫ్లై, 200 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్లలోనూ సజన్ హీట్స్‌లోనే తన పోరాటం ముగించాడు. పారా స్విమ్మింగ్‌లో చైతన్య విశ్వాస్ కులకర్ణి, సుయాశ్ నారాయణ్ జాదవ్ ఎస్7 50 మీటర్ల ఫ్రీస్టయిల్ పోటీలో ఫైనల్లో అడుగు పెట్టారు. హీట్స్‌లో కులకర్ణి (32.77 సె), జాదవ్ (35.35 సె) హీట్స్‌లో 4, 6వ స్థానాల్లో నిలిచి ముందంజ వేశారు.




### పంచ్ అదిరింది

మెగా ఈవెంట్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. బుధవారం బరిలోకి దిగిన ఆరుగురు బాక్సర్లు క్వార్టర్ ఫైనల్లో గెలిచి సెమీస్ చేరడంతో భారత్‌కు మరో ఐదు పతకాలు ఖాయమయ్యాయి. సాక్షి, సచిన్ సివాచ్, అంకుశ్ యాదవ్, అరుంధతి చౌదరి, నరేందర్ కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు. 51 కేజీ క్వార్టర్స్ పోరులో సాక్షి 5-0తో నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన కైట్లిన్ ఫ్రైయర్స్‌ను చిత్తు చేయగా.. అరుంధతి (70కేజీ) 3-1తో హెండర్సన్ (న్యూజిలాండ్)పై, జైస్మిన్ లంబోరియా 4-1తో ఎలీస్ గ్లిన్ (ఇంగ్లండ్)పై కష్టపడి గెలిచారు. మెన్స్ 60 కేజీ బౌట్‌లో మాజీ వరల్డ్ యూత్ చాంప్ సచిన్ 5-0తో మొరెమి (బోస్తానా)పై ఏకపక్ష విజయం సాధించగా.. 80 కేజీ బౌట్‌లో అంకుశ్ కూడా 5-0తో జేడ్ మికాక్ (సేచెల్స్)ను చిత్తుగా ఓడించాడు. ఇక హోరాహోరీగా సాగిన 90కేజీ క్వార్టర్స్‌లో నరేందర్ 3-2తో సెకో (సమోవా)పై చెమటోడ్చి విజయం సాధించాడు.

## వైభవ్.. 230 ర్యాంకులు అప్

### వన్డేల్లో అగ్రస్థానానికి గిల్



దుబాయ్: పదిహేనేండ్లకే అంతర్జాతీయ అరంగేట్రం చేసి రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తనదైన ముద్ర వేసేందుకు వేట ఆరంభించాడు. జింబాబ్వేతో సిరీస్‌లో (151 రన్స్) నిలకడగా రాణించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ఈ చిన్నోడు టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో ఏకంగా 230 స్థానాలు ఎగబాకి 48వ స్థానంతో టాప్-50లో అడుగుపెట్టాడు. టీ20ల్లో ఇషాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక వన్డేల్లో భారత సారథి శు భ్‌మన్ గిల్ 801 రేటింగ్ పాయింట్లతో డారిల్ మిచెల్ (న్యూజిలాండ్)ను వెనక్కినెట్టి తిరిగి నంబర్ వన్ స్థానానికి చేరాడు. వచ్చే నెలలో జరిగే దులీప్ ట్రోఫీలో ఈస్ట్‌జోన్‌కు వైభవ్ సూర్యవంశీ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈ జట్టులో వెటరన్ పేసర్ మహ్మద్ షమీ, ముకేశ్ కుమార్, షాబాజ్ అహ్మద్, అభిమన్యు ఈశ్వరన్ వంటి స్టార్ ప్లేయర్లున్నారు. దులీప్ ట్రోఫీలో ఆడటం వైభవ్‌కు ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## బ్రాండ్ బాజా ఆర్సీబీ

ఢిల్లీ: వరుసగా రెండుసార్లు ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) బ్రాండ్ వాల్యూలోనూ తమకు సాటెవరూ లేరని నిరూపించింది.బ్రాండ్ విలువలో ప్రపంచ క్రికెట్‌లో తొలిసారిగా 300 మిలియన్ల యూఎస్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 2,895 కోట్లు) దాటిన తొలి ఫ్రాంచైజీగా ఘనత సాధించింది. నిరుడు 269 మిలియన్ డాలర్లుగా ఉన్న ఆర్సీబీ విలువ.. ఈ ఏడాదికి 16 శాతం పెరిగిందని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ హౌలీహాన్ లోకీ బుధవారం ఒక నివేదికలో తెలిపింది. ఈ జాబితాలో ఆర్సీబీ (312 మిలియన్ డాలర్లు) తర్వాత ముంబై ఇండియన్స్ (264), కేకేఆర్ (245), సీఎస్కే (244), ఎస్ఆర్‌హెచ్ (168) టాప్-5లో ఉన్నాయి. ఫ్రాంచైజీ పేరు, ప్రతిష్ట, మార్కెట్ షేర్, వినియోగదారుల విశ్వసనీయత ఆధారంగా బ్రాండ్‌వాల్యూను లెక్కిస్తారు. ఇక ఓవరాల్‌గా ఐపీఎల్ బిజినెస్ విలువ 20.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.9 లక్షల కోట్లు) కు పెరిగింది. 2023తో పోలిస్తే (10.3) ఇది దాదాపు రెట్టింపు కావడం విశేషం.




# గారాల తనయ సంపూర్ణ

వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శకుటుంబం హౌస్ నెం: 47' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని పాత్రల్ని పరిచయం చేస్తూ ప్రచార కార్యక్రమాల్ని ముమ్మరం చేశారు. ఇటీవలే చిట్టిబాబు పాత్రలో వెంకటేష్‌ను, స్వర్ణ పాత్రలో కథానాయిక శ్రీనిధిశెట్టిని పరిచయం చేసిన విషయం తెలిసిందే. బుధవారం 'సంపూర్ణ' పాత్రలో యువినా పార్థవిని ఇంట్రడ్యూస్ చేస్తూ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో చిట్టిబాబు, స్వర్ణ దంపతుల గారాల కూతురిగా సంపూర్ణ కనిపిస్తుందని.. అల్లరి, అమాయకత్వం, చిలిపితనం కలబోసిన ఆమె పాత్ర నవ్వుల్ని పండిస్తుందని, కుటుంబంలో అనుకోని సంఘటనలకు కూడా కారణమవుతుందని మేకర్స్ తెలిపారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# పదేళ్ల సినీ ప్రయాణం



సోలో హీరోగా పదేళ్ల విజయవంతమైన సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు విజయ్ దేవరకొండ. సోలో హీరోగా ఆయన నటించిన తొలి చిత్రం 'పెళ్లిచూపులు' విడుదలై పదేళ్లవుతున్నది. 2016 ఆగస్ట్ 29 న విడుదలైన ఈ సినిమా ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ఈ దశాబ్ద కాలంలో టాలీవుడ్ అగ్ర కథానాయకుల్లో ఒకరిగా ఎదిగారు విజయ్ దేవరకొండ. తనదైన్నైస్టైల్, ఛరిష్మాతో యువతలో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. టాక్సీవాలా, అర్జున్‌రెడ్డి, గీత గోవిందం, డియర్ కామ్రేడ్, ఖుషి, కింగ్డమ్ వంటి చిత్రాలతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. హీరోగా రాణిస్తూనే 'ది దేవరకొండ ఫౌండేషన్'తో సేవా కార్యక్రమాల్ని చేపడుతూ అందరి మన్ననలందుకుంటున్నారు. ఇటీవలే మహబూబ్‌నగర్ జిల్లాలో 180 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించి సేవా భావాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'రణబాలి' 'రౌడీ జనార్ధన' భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. దర్శకుడు శౌర్యువ్‌తో కూడా ఓ సినిమా ఖరారైన విషయం తెలిసిందే. ఇందులో పలువురు హాలీవుడ్ సాంకేతిక నిపుణులు పనిచేస్తుండటం విశేషం.

# ధనుష్ పోలీస్ స్టోరీ?

కెరీర్ ఆరంభం నుంచి విభిన్న కథా చిత్రాలు, పాత్రల ద్వారా తనదైన పంథాను సృష్టించుకున్నారు తమిళ అగ్ర హీరో ధనుష్. అయితే కెరీర్‌లో ఇప్పటివరకు ఆయన పోలీస్ పాత్రను పోషించలేదు. అభిమానులు కూడా ఆయన్ని పోలీస్ క్యారెక్టర్‌లో చూడాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వారి అభిలాష ఫలించబోతున్నట్లు తెలిసింది. ధనుష్‌తో 'సర్' వంటి బ్లాక్‌బస్టర్ తీసిన దర్శకుడు వెంకీ అట్లూరి ఓ పవర్‌ఫుల్ పోలీస్‌స్టోరీని సిద్ధం చేస్తున్నారు. ఇందులో ధనుష్ హీరోగా నటించనున్నారు.

ఈ ప్రాజెక్ట్ కోసం తాను ప్రత్యేకంగా రీసెర్చ్ చేస్తున్నానని, యథార్థ సంఘటనల స్ఫూర్తితో కథ రాస్తున్నానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు దర్శకుడు వెంకీ అట్లూరి. ప్రస్తుతం ధనుష్ తమిళంలో 'ఓం' చిత్రాన్ని చేస్తున్నారు. 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత ధనుష్-వెంకీ అట్లూరి సినిమా పట్టాలెక్కుతుందని సమాచారం. ఇదిలావుండగా సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదలకానుంది.



# క్లైమాక్స్ ఘట్టాల్లో 'భోగి'

శర్వానంద్ తాజా చిత్రం 'భోగి' నిర్మాణ దశ నుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. తెలంగాణ నేపథ్య కథాంశంతో రూపొందుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు సంపత్‌నంది దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవలే హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో 22 రోజుల పాటు ఈ సినిమా క్లైమాక్స్ ఘట్టాలను తెరకెక్కించారు. ఈ యాక్షన్ ఎపిసోడ్‌లో 800 మందికిపైగా జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారని, స్టంట్ కొరియోగ్రాఫర్ దిలీప్ సుబ్బరాయన్ నేతృత్వంలో తెరకెక్కించిన పోరాట ఘట్టాలు గూజ్‌బంప్స్ తెప్పిస్తాయని మేకర్స్ తెలిపారు. 1960 తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఓ ఫిక్షనల్ విలేజ్‌లో జరిగే కథ ఇదని, శర్వానంద్ మునుపెన్నడూ చూడని రీతిలో రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తారని దర్శకుడు సంపత్‌నంది పేర్కొన్నారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాత: కె.కె.రాధామోహన్, రచన-దర్శకత్వం: సంపత్‌నంది.



# తెలుగులో సొంత డబ్బింగ్

పరభాషా నాయికలు తెలుగులో డబ్బింగ్ చెప్పడం ఇప్పుడు మామూలు విషయంగా మారింది. నిత్యామీనన్, సమంత, రాశీఖన్నా వంటి అగ్ర తారలు తెలుగులో ఓన్ డబ్బింగ్‌తో ప్రేక్షకుల్ని మెప్పించారు. సొంత గొంతు వల్లే తమ పాత్రలకు సహజత్వం వస్తుందని చాలా మంది నాయికలు నమ్ముతున్నారు. తాజాగా వారి బాటలో అడుగులు వేయనుంది గ్లోబల్‌స్టార్ ప్రియాంకచోప్రా. 'వారణాసి' చిత్రంలో ఈ భామ సొంత గొంతును వినిపించబోతున్నదని ఫిల్మ్‌నగర్ టాక్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్‌పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఓవైపు షూటింగ్‌తో పాటు సమాంతరంగా పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్‌ని కూడా పూర్తిచేస్తున్నారు దర్శకుడు రాజమౌళి. ఈ నేపథ్యంలో సొంత డబ్బింగ్ కోసం ప్రియాంకచోప్రా సిద్ధమవుతున్నదని, ఓ ట్యూటర్ సహాయంతో తెలుగుపై పట్టుసాధించేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నదని తెలిసింది. దర్శకుడు రాజమౌళి సైతం ప్రియాంకచోప్రాను ఓన్ డబ్బింగ్ కోసం ప్రోత్సహిస్తున్నారట. అన్నీ కుదిరితే ఆమెతోనే డబ్బింగ్ చెప్పించే ఛాన్స్ ఉందని ఇన్‌సైడ్ టాక్. 'వారణాసి' చిత్రంలో మందానికి అనే పాత్రలో ప్రియాంకచోప్రా కనిపించనుంది.

Printed & Published by YAMJALA PRAVEEN, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221 , Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com